సాక్షి
కామారెడ్డి
మంగళవారం। 15। ఏప్రిల్। 2025



ఫ్లెక్సీ వివాదం..
లింగంపేట అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు వివాదానికి దారి తీశాయి. దీంతో ఉద్రిక్తత నెలకొంది.
- 8లో ▸



ఘనంగా అంబేడ్కర్ జయంతి
జిల్లాలో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.
- 9లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
39.7 /20.4

వాతావరణం
ఉదయం ఆకాశం మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలున్నాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

పరిష్కారం దొరికేనా?

- ధరణి పోర్టల్ స్థానంలో 'భూ భారతి'
- పైలట్ ప్రాజెక్టుగా లింగంపేట ఎంపిక
- నేటి నుంచి అమలుకు చర్యలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : భూ భారతి ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపుతామని ప్రభుత్వం చెబుతోంది. అందులో భాగంగా ఎంపిక చేసిన మండలాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేసి అక్కడ వచ్చిన ఫలితాల ఆధారంగా మార్పులు చేర్పులతో రాష్ట్రమంతటా అమలు చేయాలని సంకల్పించింది. కాగా లింగంపేట మండలంలో అనేక వివాదాలున్నాయి. గతంలో నకిలీ పాస్‌పుస్తకాల తయారు చేయడంతోపాటు వాటిపై రుణాలు తీసుకున్న ఉదంతాలు ఎన్నో వెలుగు చూశాయి. ఇప్పటికీ లింగంపేట మండలంలో అనేక వివాదాలు కొనసాగుతున్నాయి. చాలా గ్రామాల్లో అటవీ భూములు, ప్రభుత్వ భూములు, అసైన్‌మెంట్ భూములకు సంబంధించిన వివాదాలున్నాయి. రైతులు సాగు చేసుకుంటున్న అటవీ భూములకు ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు ఇచ్చింది. అయితే వాటిపై రైతులకు హక్కు లేదంటూ అటవీ అధికారులు పంటలను ధ్వంసం చేసిన సంఘటనలున్నాయి.

మండల కేంద్రంలోనూ వివాదాలు..

లింగంపేట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంతో సహా అన్ని కార్యాలయాలు, జూనియర్ కాలేజీ భవనం ఉన్న భూములకు సంబంధించిన వివాదాలు ఉన్నాయి. ధరణిలో వాటికి ఎలాంటి పరిష్కారం చూపలేదు. సాగు భూములు, నివాస గృహాలకు సంబంధించి కొన్ని సర్వే నంబర్లను ఫారెస్ట్ గెజిట్‌లో పేర్కొన్నారు. దీంతో ఆ భూములకు పాస్ పుస్తకాలు జారీ కాలేదు. ఫలితంగా రైతులకు రైతుబంధు అందలేదు.

భూభారతి అయినా దారి చూపేనా...

ప్రభుత్వం భూములకు సంబంధించిన అన్ని వివాదాలను పరిష్కరిస్తామని చెబుతోంది. ఆయా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే దీనిని తీసుకువచ్చామంటోంది. ఈ నేపథ్యంలో లింగంపేట మండలంలో దశాబ్దాలుగా ఉన్న భూ వివాదాలకు భూభారతి ద్వారానైనా పరిష్కారం దొరుకుతుందా అన్న అంశంపై చర్చ నడుస్తోంది. రాష్ట్రానికి దిక్సూచిలా ఉండేలా ఇక్కడ అమలు జరిగితేనే సత్ఫలితాలు వస్తాయని భావిస్తున్నారు. సర్కారు తీసుకువచ్చిన నూతన పోర్టల్‌పై ఈ ప్రాంత రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. తమ సమస్యలకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

భూ వివాదాలను పరిష్కరించడంలో ధరణి విఫలమవడమే గాకుండా అనేక సమస్యలను తెచ్చిపెట్టిందని భావిస్తున్న ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం.. దాని స్థానంలో భూ భారతి పోర్టల్‌ను తీసుకువచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయడానికి ప్రయోగాత్మకంగా రాష్ట్రంలో నాలుగు మండలాలను ఎంపిక చేసింది. అందులో జిల్లాలోని లింగంపేట మండలం ఒకటి. మంగళవారంనుంచి లింగంపేట మండలంలో భూభారతి పోర్టల్ పనిచేయనుంది. ఇక్కడి అధికారులు భూభారతి పోర్టల్ ద్వారానే భూ రికార్డుల పరిశీలన, సరిచేయడం, రిజిస్ట్రేషన్లు... ఇలా ప్రతీది చేపట్టనున్నారు.

అసైన్డ్ పట్టాల లెక్క తేలేనా?

ప్రభుత్వాలు భూమిలేని పేదలకు ముఖ్యంగా దళితులు, గిరిజనులకు ఇచ్చిన అసైన్డ్ భూములకు సంబంధించి చాలా వివాదాలున్నాయి. అప్పట్లో ఇష్టారీతిన పట్టాలు జారీ చేశారు. ప్రభుత్వాలు ఏటా కొందరికి అసైన్డ్ భూముల పట్టాలు ఇస్తూ పోయాయి. ఒక్కో సర్వే నంబరులో ఉన్న భూవిస్తీర్ణం కన్నా ఎక్కువ విస్తీర్ణానికి పట్టాలు ఇచ్చారు. విస్తీర్ణం కన్నా ఎక్కువ పట్టాలు ఉండడంతో వివాదాలు ఏర్పడ్డాయి. దీంతో తమకు పట్టా ఉందంటే తమకు ఉందంటూ గొడవలకు దిగిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. అలాగే అటవీ భూముల్లో పోడు సేద్యం చేస్తున్న రైతులకు గతంలో ప్రభుత్వాలు ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు ఇచ్చాయి. అయితే పట్టాలు ఉన్నా అటవీ అధికారులు వాటిని స్వాధీనం చేసుకోవడంతో రైతులకు, అటవీ అధికారులకు మధ్య గొడవలు జరుగుతున్నాయి.



తాడ్వాయిలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ చందర్‌నాయక్

రికార్డు స్థాయిలో రక్తసేకరణ

- తలసేమియా వ్యాధి బాధితుల కోసం నిర్వహించిన శిబిరానికి విశేష స్పందన
- అభినందించిన అడిషనల్ కలెక్టర్ చందర్‌నాయక్

తాడ్వాయి : అంబేడ్కర్ జయంతి సందర్భంగా రాష్ట్ర చరిత్రలో మొట్టమొదటిసారిగా 135 యూనిట్ల రక్తాన్ని సేకరించడం గొప్ప విషయమని అడిషనల్ కలెక్టర్ చందర్‌నాయక్ పేర్కొన్నారు. తలసేమియా బాధిత చిన్నారుల కోసం సోమవారం తాడ్వాయి హైస్కూల్‌లో జిల్లా రక్తదాతల సమూహం, ఇంటర్నేషనల్ వైశ్యఫెడరేషన్, అంబేడ్కర్ సంఘాల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రక్త సేకరణలో తాడ్వాయి మండలం ఆదర్శంగా నిలిచిందన్నారు. మానవతా దృక్పథంతో రక్తదానానికి ముందుకు వచ్చిన వారిని అభినందించారు. రక్తదాతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. అనంతరం ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ బాలు, రక్తదాతల సమూహం జిల్లా అధ్యక్షుడు జమీల్ మాట్లాడారు. రెండేళ్లలో కామారెడ్డి జిల్లాలో తలసేమియావ్యాధితో బాధపడుతున్న వారికోసం నాలుగు వేల యూనిట్ల రక్తం సేకరించినట్లు తెలిపారు. రాష్ట్ర చరిత్రలో అధిక రక్తాన్ని సేకరించిన ఘనత కామారెడ్డి జిల్లాకు దక్కిందన్నారు. దీంతో ఇండియన్ బుక్ఆఫ్ రికార్డులో కూడా చోటు దక్కిందన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చి రక్తదాన శిబిరంలో పాల్గొని యువకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో రామస్వామి, కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, సింగిల్‌విండో చైర్మన్ కపిల్ రెడ్డి, కాంగ్రెస్ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు భాగయ్య, నియోజకవర్గ అధ్యక్షుడు గైని శివాజీ, నాయకులు వెంకటి, వేదప్రకాష్, వెంకటరమణ, ఎర్రం చంద్రశేఖర్, సంజీవులు, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంతో సమావేశంలో అదనపు కలెక్టర్



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో సోమవారం కలెక్టర్లతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమై వివిధ అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో కామారెడ్డి నుంచి అదనపు కలెక్టర్ విక్టర్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

కేంద్రీయ విద్యాలయం కోసం ఉన్నత పాఠశాల పరిశీలన



మద్నూర్: కేంద్రీయ విద్యాలయం కోసం మద్నూర్‌లోని బాలుర ఉన్నత పాఠశాలను సోమవారం ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పరిశీలించారు. కేంద్రీయ విద్యాలయం కోసం పక్షం క్రితం కేంద్రీయ విద్యాలయాల డిప్యూటీ కమిషనర్ మంజునాథ్, డీఈవో రాజు మద్నూర్‌లో రెండు స్థలాలను పరిశీలించారు. కానీ అవి అనుకులంగా లేవని తిరస్కరించారు. ఈసారి సరైన స్థలం చూపించకపోతే కేంద్రీయ విద్యాలయం ఇతర ప్రాంతాలకు తరలిపోయే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే హైస్కూల్‌ను పరిశీలించి, గదుల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలుర ఉన్నత పాఠశాలలో తాత్కాలికంగా కేంద్రీయ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని యోచిస్తున్నామన్నారు. బాలుర ఉన్నత పాఠశాలను పక్కనే ఉన్న ప్రాథమిక, ఉర్దూ మీడియం పాఠశాల భవనంలో సర్దుబాటు చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగ్‌నాథ్, విజయ్, భీం తదితరులున్నారు.

నేడు కామారెడ్డిలో జాబ్ మేళా

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో న్యూలాండ్ లాబోరేటరీస్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ, ఫార్మాటెక్, ఎంఎల్‌టీ బ్రిడ్జి కోర్సు, బీఎస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసినవారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో జాబ్‌మేళాకు హాజరుకావాలన్నారు. ఈనెల 16న బాన్సువాడ, 17న ఎల్లారెడ్డి, 18న బిచ్కుంద ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జాబ్ మేళాలు ఉంటాయన్నారు.

ఓరియంటల్ స్కూల్‌కు పూర్వ విద్యార్థుల విరాళం



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఓరియంటల్ స్కూల్ అభివృద్ధి కోసం 2000–2001 పూర్వ విద్యార్థులు సోమవారం లక్ష రూపాయల విరాళం ఇచ్చారు. ప్రస్తుత హెచ్‌ఎం సుధాకర్, పూర్వ హెచ్‌ఎం మురళిరెడ్డి, ఉపాధ్యాయుడు భాస్కరశర్మలను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రంజిత్‌కుమార్, చంద్రశేఖర్, అనిల్, కళ్యాణ్, స్వామి, ప్రసన్న, సంధ్య, కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నేడు బాన్సువాడకు ఎమ్మెల్సీ కవిత రాక

బాన్సువాడ : బాన్సువాడకు మంగళవారం బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ రానున్నారు. పట్టణంలోని భారత్ గార్డెన్‌లో నిర్వహించే పార్టీ రజతోత్సవ సభ సన్నాహక సమావేశంలో వారు పాల్గొంటారని బీఆర్‌ఎస్ పట్టణ నాయకులు తెలిపారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

సబ్‌స్టేషన్‌లో వీసీబీ ప్రారంభం



లింగంపేట: అయిలాపూర్‌లోని సబ్ స్టేషన్‌లో వ్యాక్యూమ్ సర్క్యూట్ బ్రేకర్(వీసీబీ) ఫీడర్‌ను సోమవారం ఎస్ఈ శ్రవణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీడర్ బ్రేకర్ ద్వారా అయిలాపూర్ గ్రామానికి 24 గంటలపాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి డీఈ విజయసారథి, ఏడీఈ మల్లేశం, ఎల్‌ఎం మోతీలాల్, ఏఎల్‌ఎంలు మల్లయ్య, ఆదిరెడ్డి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

జింక పిల్ల లభ్యం

రుద్రూర్: పోతంగల్ మండలం కల్లూర్ గ్రామ శివారులో సోమవారం రైతులకు జింక పిల్ల కనిపించింది. దానిని వారు అటవీశాఖ సిబ్బందికి అప్పగించారు. అధికారులు వర్ని ఫారెస్ట్ రేంజ్ కార్యాలయానికి తరలించి చికిత్స చేయించారు.

మహాలక్ష్మి బకాయిలను చెల్లించాలి



రాష్ట్ర మహా సభలో పాల్గొన్న బీఎంఎస్ ప్రతినిధులు సాయిరెడ్డి, రామ్మోహన్, శ్రీనివాస్, నేతలు

- ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి
- బీఎంఎస్ రాష్ట్ర సంఘటన మంత్రి రామ్మోహన్

కామారెడ్డి టౌన్ : మహాలక్ష్మి పథకానికి సంబంధించిన బకాయిలను ఆర్టీసీకి వెంటనే చెల్లించాలని భారతీయ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) రాష్ట్ర సంఘటన మంత్రి రామ్మోహన్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ మైదానంలో బీఎంఎస్ అనుబంధ టీజీఎస్‌ఆర్టీసీ కార్మిక సంఘ్ నాలుగో రాష్ట్ర మహాసభ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రకటించాలన్నారు. ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీ సంస్థ ద్వారా కొనుగోలు చేయాలన్నారు. కార్మికులపై వేధింపులు మానుకోవాలని, రిమూవ్ విధానాన్ని రద్దు చేయాలని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కలాల్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సంస్థలో అన్ని విభాగాల్లో చాలా ఏళ్లుగా ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ అధ్యక్షుడు కొండల సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక

బీఎంఎస్ అనుబంధ టీజీఎస్‌ఆర్టీసీ కార్మిక్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా వెంకటాచారి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బసంత్, ఉపాధ్యక్షుడిగా శోభన్ బాబు, ప్రధాన కార్యదర్శిగా ఎర్ర స్వామి, కోశాధికారిగా రమేష్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా నోముల ప్రసాద్, సెక్రెటరీలుగా వెంకట్ యాదవ్, మాణిక్యం, ఎల్లం, రమేష్, నర్సింలు, శివకుమార్, అనసూయ, రవీందర్ గౌడ్, మనోహర్‌రావు, కులకర్ణి, సలహాదారులుగా వెంకట్‌రెడ్డి, తిరుపతి గౌడ్, రాఘవులు, గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఇన్‌చార్జీగా పి.శ్రీపతి, హైదరాబాద్ జోన్ ఇన్‌చార్జీగా టి.పోషాద్రి ఎన్నికయ్యారు.

పంటను కాపాడుకునేందుకు భగీరథయత్నం

- అక్కాపూర్ గ్రామానికి చెందిన అరిగె లక్ష్మణ్ అనే రైతు ఉన్న ఒక్క బోరు కింద ఆరు ఎకరాల వరి సాగు చేశాడు. మండుతున్న ఎండలతో భూగర్భజలాలు తగ్గిపోయి బోరు వట్టిపోయింది. దీంతో ఎకరం వరకు పంట ఎండిపోయింది. మిగిలిన పంటను కాపాడుకునేందుకు అప్పులు చేసి మరో బోరు తవ్వించాడు. ప్రస్తుతం ఆ బోరు నీటితో వరుస తడులు అందిస్తున్నాడు.
- బండరామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన గోత్రాల శంకర్ అనే రైతు ఐదెకరాలలో వరి వేశాడు. రెండు బోరు బావులు వట్టిపోయాయి. దీంతో పక్కరైతు బోరు నుంచి పైపు వేసుకుని పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నాడు.

మాచారెడ్డి : మండుతున్న ఎండలతో భూగర్భ జలాలు అడుగంటిపోయి పంటలు ఎండిపోతున్నాయి. కళ్లముందే పంటలు ఎండిపోతుండడంతో తట్టుకోలేని రైతులు.. సాగునీటి కోసం భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. కొత్తగా బోరుబావులు తవ్విస్తున్నారు. అయినా ఫలితం ఉండడం లేదు. దీంతో చేసేదేమీ లేక పలువురు రైతులు పంటపై ఆశలు వదిలేసుకుని పశువులను మేపుతున్నారు. ఓవైపు సాగునీరందక పంటలు ఎండిపోతుంటే.. మరోవైపు తెగుళ్లతో మరింత నష్టం వాటిల్లుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.



బండరామేశ్వర్‌పల్లిలో పంటను కాపాడుకునేందుకు పక్కరైతు బోరునుంచి పైపుతో నీటిని పారిస్తున్న రైతు శంకర్

మన పనుల్లో ఉత్తరాది కార్మికులు

ఉమ్మడి జిల్లాలో ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన కార్మికులు గణనీయంగా పెరిగారు. ప్రతి రంగంలో వారి ఉనికి కనిపిస్తోంది. సుమారు ఐదువేల మంది వరకు కార్మికులు వివిధ రంగాల్లో పనిచేస్తున్నట్లు అంచనా. హోటళ్లలో కార్మికులుగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన వారు ఉన్నారు. వ్యవసాయం, నిర్మాణ రంగం, ఇంటీరియర్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్, టైల్స్, కార్పెంటర్ కార్మికులుగా బిహార్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ వారు పని చేస్తున్నారు. బొటిక్స్, డిజైనింగ్ వంటి మహిళల వస్త్రాల పనులు పశ్చిమబెంగాల్ కార్మికులే చేస్తున్నారు. బంగారం పనులను బెంగాలీలే చేస్తున్నారు.



అన్ని రంగాల్లో వారి ఉనికి

- నగరం నుంచి గ్రామం వరకు విస్తరించిన వలస కార్మికులు
- సుమారు ఐదు వేల మంది ఉన్నట్లు అంచనా
- హోటళ్లు, నిర్మాణ రంగం, వ్యవసాయం, అనుబంధ రంగాల్లో వారే..
- బంగారం పని, మహిళల వస్త్రాల డిజైనింగ్ పనుల్లోనూ వారి మార్క్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన కార్మికులు రోజురోజుకూ పెరుగుతున్నారు. దీంతో ప్రతి రంగంలోనూ ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, బిహార్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు, పనివాళ్లే కనిపిస్తున్నారు. గతంలో ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి ముంబయి, సూరత్, గల్ఫ్ దేశాలకు పనుల కోసం ఎక్కువగా వలసలు వెళ్లేవారు. ఇప్పటికీ ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి గల్ఫ్ దేశాలకు వెళుతున్నప్పటికీ గతంతో పోలిస్తే సంఖ్య తగ్గింది. వివిధ రంగాల అభివృద్ధితో జిల్లాలోనూ ఉపాధి అవకాశాలు పెరిగాయి. స్థానికంగానూ ఎకానమీ పెరిగింది. అయితే స్థానికుల కంటే ఉత్తరాది రాష్ట్రాల వారినే పనిలో పెట్టుకునేందుకు జిల్లాలోని రైతులు, వ్యాపారులు మొగ్గు చూపుతున్నారు. నిర్దేశించుకున్న సమయానికి, తక్కువ వేతనాలతోనే ఉత్తరాది రాష్ట్రాల కార్మికులు పనులు చేస్తున్నారని, పైగా నైపుణ్యం ఎక్కువగా చూపిస్తున్నారని పలువురు చెబుతున్నారు.

ఉత్తర భారతం నుంచి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు వివిధ పనుల నిమిత్తం సుమారు ఐదువేల మంది వరకు కార్మికులు వచ్చినట్లు అంచనా. ముఖ్యంగా హోటళ్లలో కార్మికులుగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన సుమారు 500 మంది కార్మికులు ఉన్నారు. ఇటుక బట్టీలు మొదలు నిర్మాణరంగంలో బిహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సుమారు 1,500 మంది కార్మికులు ఇంటీరియర్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్, టైల్స్, కార్పెంటర్ కార్మికులుగా పని చేస్తున్నారు. సెలూన్స్‌లో ఉత్తరప్రదేశ్, ఢిల్లీ వాళ్లు పనిచేస్తున్నారు. వ్యవసాయ రంగంలో బిహార్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల కార్మికులు సుమారు 1,000 మంది వరకు పనిచేస్తున్నారు. వరినాట్ల సీజన్‌లో బిహార్ కూలీలు పనిచేస్తున్నారు. డెయిరీ పనితోపాటు చేపలు పట్టే పనులు సైతం చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో హమాలీలుగా చేస్తున్నారు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బేకరీలు, స్వీట్‌హోంలలో ఒడిశా, రాజస్తాన్, ఉత్తరప్రదేశ్ వాళ్లు పనిచేస్తున్నారు. బొటిక్స్, డిజైనింగ్ వంటి మహిళల వస్త్రాల పనులు పశ్చిమబెంగాల్ కార్మికులే చేస్తున్నారు. బంగారం పనులను బెంగాల్ వాళ్లే చేస్తున్నారు. వీరు 1,000 మంది వరకు ఉన్నట్లు తెలుస్తోంది. బిహార్‌కు చెందిన కూలీలు ఇటుకబట్టీలో సుమారు 500 మంది వరకు పనిచేస్తున్నారు. బోర్ డ్రిల్లింగ్, పొక్లెయిన్ ఆపరేటింగ్ పనుల్లో ఉత్తరప్రదేశ్, బిహార్‌కు చెందిన వాళ్లు పనిచేస్తున్నారు. ఇందులో కొందరు సీజన్‌ను బట్టి పనుల కోసం వచ్చి వెళుతుండగా, ఎక్కువమంది పనిచేసుకుంటూ కూలీలుగా జీవిస్తూ ఇక్కడే స్థిరపడినవారు సుమారు 3వేల మంది వరకు ఉండడం గమనార్హం. రాజస్తాన్‌కు చెందిన కొందరు నిజామాబాద్‌తో పాటు వివిధ మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీ గ్రామాల్లో స్వీట్‌హోమ్‌లు నిర్వహిస్తూ స్థిరపడ్డారు. కొన్ని ప్రైవేట్ పరిశ్రమలు, వాణిజ్య కేంద్రాల్లో సెక్యూరిటీ గార్డులుగా బిహార్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారు పనిచేస్తున్నారు. పెద్ద హోటళ్లలో వర్కర్లుగా అస్సాంకు చెందిన యువకులు పనిచేస్తున్నారు.

“సీజన్‌లో వచ్చి వ్యవసాయ పనులు చేస్తా



మాది ఒడిశాలోని బరంపురం. మాకు కూడా వ్యవసాయం ఉంది. సీజన్‌లో నిజామాబాద్‌కు వస్తాం. జిల్లా అంతటా తిరిగి వ్యవసాయ పనులు చేస్తాం. వ్యవసాయానికి సంబంధించి అన్ని పనులు చేస్తా. దాదాపు పదేళ్లుగా ఇక్కడికి వస్తున్నా. నాతోపాటు మా గ్రామంలోని యువకులను కూడా తీసుకువస్తా. వారికి ఉపాధి బాగా దొరుకుతోంది. వచ్చిన డబ్బులతో మిగతా కాలం జీవిస్తాం.

– అరుణ్ సహానీ, బరంపురం, (ఒడిశా)

డార్జిలింగ్ నుంచి ఇందూరుకు..



“ మాది పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ ప్రాంతం. నేను హోటల్ మేనేజ్‌మెంట్‌లో పీజీ చేశాను. నిజామాబాద్‌కు రెండేళ్ల క్రితం వచ్చాను. వినాయక్‌నగర్‌లో ఫాస్టుఫుడ్ సెంటర్ నిర్వహిస్తున్నా. నా భార్య బ్యూటీపార్లర్ నిర్వహిస్తోంది. ఇద్దరం కలిసి నెలకు రూ.50 వేల వరకు సంపాదిస్తున్నాం. మాకు వచ్చిన దాంట్లో మా తల్లిదండ్రులకు పంపిస్తున్నాం.

– సుజిత్ టక్రీ, మోమోస్ స్పెషలిస్టు

రూ.45వేల వరకు సంపాదిస్తా



” మాది బీహార్ రాజధాని పాట్నా సమీపంలోని రాంపూర్ రూరల్ ప్రాంతం. సంవత్సరానికి రెండుసార్లు నిజామాబాద్‌కు వస్తాం. సీజన్‌లో ధాన్యం పనులు చేస్తాం. ఎకరాకు ఇంత అని మాట్లాడుకుంటాం. ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్, సంచుల్లోకి నింపడం, వాటిని కుట్టడం వంటి పనులు చేస్తాం. బస్తాకు రూ.13 ఇస్తారు. ప్రతి సీజన్‌లో రూ.30 వేల నుంచి రూ.45 వేల వరకు సంపాదిస్తా.

– రంజిత్ రాణా, పాట్నా (బీహార్)

క్లుప్తంగా

శాంతి భద్రతలకు ప్రతి ఒక్కరూ సహకరించాలి



భిక్కనూరు: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సంపత్ కుమార్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు ఆయనను అభినందిస్తూ శాలువాలతో సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ దొంగతనాల నివారణకు ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై ఆంజనేయులు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి శంకర్, జిల్లా ప్రతినిధి లక్ష్మణ్ పలువురు నాయకులు ఉన్నారు.

'భూభారతి' ప్రారంభ కార్యక్రమాన్ని తిలకించిన రైతులు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి రైతు వేదికలో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భూ భారతి పోర్టల్ ప్రారంభ కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు తిలకించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ప్రజాపతి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగారెడ్డి, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు లింగాగౌడ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మద్దెల బాగయ్య, సీడీసీ చైర్మన్ ఇర్షాదొద్దిన్, విండో చైర్మన్ సదాశివరెడ్డి, సాదీక్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

మహమ్మద్ నగర్ రైతువేదికలో..

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్‌లోని రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భూ భారతి పోర్టల్ ప్రారంభ కార్యక్రమాన్ని పిట్లం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్‌కుమార్, అధికారులతో కలిసి తిలకించారు.కార్యక్రమంలో మహమ్మద్ నగర్, నిజాంసాగర్ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, ఏలే. మల్లికార్జున్, మహమ్మద్ నగర్ మండల వ్యవసాయశాఖ అధికారిణి నవ్య, ఏఈవోలు మధుసూదన్, రేణుక, రైతులు ఉన్నారు.

కల్తీ కల్లు బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలి



బాన్సువాడ : కల్తీ కల్లు సేవించి ఆస్పత్రి పాలైన బాధితులందరికి నష్టపరిహారం ఇవ్వాలని పౌర హక్కులసంఘం నిజనిర్ధారణ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం నస్రుల్లాబాద్ మండలం దుర్కి, అంకోల్, అంకోల్‌తండా గ్రామాల్లో కమిటీ సభ్యులు పర్యటించారు. ఇటీవల కల్తీకల్లు సేవించి ఆస్పత్రి పాలైన బాధితులను కలిసి వివరాలు సేకరించారు. కల్లు బాధితులందరికి ఒక్కొక్కరికి రూ. లక్ష నష్టపరిహారాన్ని కల్తీ కల్లు కాంట్రాక్టరు వద్ద ఇప్పించాలని వారు డిమాండ్ చేశారు. మత్తు, పదార్థాలైన డైజోఫాం, క్లోరోఫాం రవాణాను అరికట్టాలన్నారు.అర్హులైన గీత కార్మికులకు మాత్రమే లైసెన్సులు ఇవ్వాలని, గీత కార్మికులందరికి నెలకు రూ. 3 వేల పింఛను ఇవ్వాలని, గీత పారిశ్రామిక సహకార సొసైటీలను ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. కల్తీ కల్లు తయారు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సభ్యులు అల్గోట్ రవీందర్, సంగం, ఎడ్ల రాజు, గైని శ్రీనివాస్ తదితరులున్నారు.

ఫ్లెక్సీ వివాదం.. ఐదు గంటల నిరసన

- పలువురు దళిత నాయకులను అరెస్టు చేసిన పోలీసులు
- సీఐ క్షమాపణ చెప్పాలంటూ దళిత సంఘాల పట్టు
- డీఎస్పీ చొరవతో ఆందోళన విరమణ



రాస్తారోకో చేస్తున్న దళితులు, మాజీ ఎమ్మెల్యే సురేందర్



ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌ను అడ్డుకుంటున్న అంబేడ్కర్ సంఘం నాయకులు

లింగంపేట: మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు వివాదానికి దారితీశాయి. సుమారు ఐదు గంటల పాటు లింగంపేటలో ఉద్రిక్తత నెలకొంది. వివరాలిలా ఉన్నాయి. సోమవారం కాంగ్రెస్ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విగ్రహం వద్ద దళిత సంఘాలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో మాజీ ఎమ్మెల్యే జాజాల, ఎమ్మెల్సీ కవిత ఫొటోలు ముద్రించి ఉండడాన్ని గమనించారు. అందులో ప్రస్తుత ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఫొటో ముద్రించకపోవడంతో కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. ఆ ఫ్లెక్సీలు తొలగించాలని పంచాయతీ కార్యదర్శి శ్రవణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన విగ్రహం వద్దకు చేరుకొని ఫ్లెక్సీలను తొలగించాలని అంబేడ్కర్ సంఘం నాయకులకు సూచించారు. నిబంధనల ప్రకారం 50 ఫీట్ల దూరంలో ఎలాంటి ఫ్లెక్సీలు ఉండవద్దన్నారు. ఫ్లెక్సీలను తొలగించడానికి అంగీకరించకపోవడంతో లింగంపేట ఎస్సై వెంకట్రావు ఈ విషయాన్ని ఎస్సై ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్ దృష్టికి తీసుకువెళ్లారు.

సీఐ ప్రవర్తనతో పెరిగిన ఉద్రిక్తత

సీఐ రవీందర్‌నాయక్ లింగంపేటకు వచ్చి దళిత సంఘాల నేతలతో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకుల ఫ్లెక్సీలు కూడా తొలగించాలని వారు పేర్కొన్నారు. ఈ క్రమంలో సీఐ సూచనతో గ్రామ పంచాయతీ సిబ్బంది కొన్ని ఫ్లెక్సీలు తొలగించి ట్రాక్టర్‌లో తరలిస్తుండగా దళిత సంఘాల నాయకులు వాగ్వాదానికి దిగారు. కాంగ్రెస్ ఫ్లెక్సీలు కూడా తొలగించాలని పట్టుబట్టారు. కాంగ్రెస్ ఫ్లెక్సీలు తొలగించనంటూనే ఏం చేసుకుంటారో చేసుకోండంటూ సీఐ అసభ్య పదజాలంతో దూషించారని దళిత సంఘాల నాయకులు ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. దీంతో రాస్తారోకో చేస్తున్న వారిని పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మండల అంబేడ్కర్ సంఘం గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ ముదాం సాయిలును అరెస్టు చేసే క్రమంలో ఆయన చొక్కా చిరిగిపోగా ప్యాంటు ఊడిపోయింది. అర్ధనగ్నంగా ఉన్న సాయిలును పోలీసులు లాక్కెళ్లి పోలీసు వాహనంలోకి ఎక్కించారు. విషయం తెలుసుకున్న మండలంలోని దళిత సంఘాల నేతలంతా వచ్చి ధర్నాకు దిగారు. ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ లింగంపేటకు చేరుకొని కామారెడ్డి -ఎల్లారెడ్డి చౌరస్తాలో బైఠాయించారు. దళితులను అవమానించిన సీఐ రవీందర్ నాయక్‌పై చర్యలు తీసుకోవాలని



మాజీ ఎమ్మెల్యేతో చర్చలు జరుపుతున్న బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ

డిమాండ్ చేశారు. బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ, కామారెడ్డి సీఐ చంద్రశేఖర్‌రెడ్డితోపాటు పలువురు ఎస్సైలు, పోలీసులు లింగంపేటకు చేరుకుని పరిస్థితి అదుపు తప్పకుండా చూశారు. డీఎస్పీ సత్యనారాయణ మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌తో చర్చలు జరిపారు. దళిత సంఘాల నేతల డిమాండ్ మేరకు అరెస్టు చేసిన వారిని బేషరతుగా విడుదల చేస్తామని పేర్కొన్నారు. లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే ఎల్లారెడ్డి సీఐపై ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని పేర్కొనడంతో దళిత సంఘాల నాయకులు శాంతించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే సురేందర్, మాజీ ఎంపీపీ ముదాం సాయిలు, దళిత సంఘాల నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భారత్‌ను విశ్వగురువుగా నిలబెట్టడమే బీజేపీ లక్ష్యం

రాజంపేట/కామారెడ్డి రూరల్/భిక్కనూరు : భారత్‌ను విశ్వగురువుగా నిలబెట్టడమే బీజేపీ లక్ష్యమని, ఇందుకు మోదీతో పాటు ప్రతి కార్యకర్త నిరంతరం శ్రమిస్తూనే ఉన్నారని రాజంపేట మండల బీజేపీ పార్టీ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి అన్నారు. మండల శాఖ ఆధ్వర్యంలో పొందుర్తి శాఖ ఆధ్వర్యంలో, కామారెడ్డి మండలం చిన్న మల్లారెడ్డి శాఖ ఆధ్వర్యంలో, భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డి గ్రామంలో 'గావ్ చలో బస్తీ చలో' కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం బూత్ కమిటీల సమావేశంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కుంటా లక్ష్మారెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి రాయపల్లి సంతోష్‌రెడ్డి, రాజంపేట మండల బీజేపీ పార్టీ అధ్యక్షుడు సంపత్ రెడ్డిలు మాట్లాడారు.పెద్దమల్లారెడ్డి గ్రామంలో నల్ల పోచమ్మ ఆలయం వద్ద నాయకులు స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. కేంద్రం ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనుల కరపత్రాలను పలు చోట్ల పంపిణీ చేశారు. భిక్కనూరు మండల బీజేపీ పార్టీ అధ్యక్షులు రమేష్, నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీధర్ రెడ్డి, రాజంపేట మండల బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పొందుర్తి గ్రామంలో కరపత్రాలను అందిస్తున్న బీజేపీ నాయకులు

వారసత్వ చెరువు.. నోచుకోని అభివృద్ధి



అభివృద్ధికి నోచుకోని కామారెడ్డి అలుగు

- రూ.8.96 కోట్ల వ్యయంతో మినీ ట్యాంక్ బండ్, పునరుద్ధరణకు శంకుస్థాపన
- ముళ్లచెట్లతో దర్శనమిస్తున్న కామారెడ్డి పెద్దచెరువు
- అధికారుల నిర్లక్ష్యంపై పట్టణ ప్రజల ఆగ్రహం

కామారెడ్డి అర్బన్ : ప్రపంచ వారసత్వ కామారెడ్డి పెద్ద చెరువు అభివృద్ధికి నోచుకోవడంలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో 2016 సంవత్సరంలో మిషన్ కాకతీయ ఫేజ్-2 కింద రూ. 8కోట్ల 96 లక్షల వ్యయం అంచనాతో కామారెడ్డి పెద్ద చెరువు మినీ ట్యాంక్ బండ్, పునరుద్ధరణ పనులు చేపట్టారు. అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి టి.హారీష్‌రావు జూలై 17, 2016 లో పనులకు శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి పనులు కొనసాగుతునే ఉన్నాయి. చెరువు కట్టపై నిర్మించిన పాదచారుల బాట ముళ్ల చెట్లతో బీటలు వారుతు ఎక్కడికక్కడ పగిలిపోయింది. భూసత్తెమ్మ గుడి సమీపంలో చెరువు కట్టకుంగిపోయింది. పట్టణానికి ప్రధాన



కుంగిపోతున్న కామారెడ్డి చెరువు కట్ట

నీటి వనరుగా ఉండడంతో పాటు పాత పట్టణానికి నీరు అందించే ఈ చెరువుపై పాలకులు నిర్లక్ష్యం వహించడంపై పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణ రెడ్డి చెరువు కట్టపై వాకింగ్ చేసి పనులను కళ్లరా చూసినా నేటికి ఒక్క అడుగు ముందుకు పడలేదు. కాంగ్రెస్ ప్రభుత్వమైన పెద్ద చెరువుపై శ్రద్ధ వహించి పునరుద్ధరణ పనులు పూర్తి చేసి సుందరీకరణ చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



పనులకు సంబంధించిన శిలాఫలకం

నిధులున్న మేరకు పనులు చేశాం

కాకతీయ ఫేజ్ -2 కింద మంజూరైన నిధులతో చెరువు కట్ట బలోపేతం, పాదచారుల బాట, సోలార్ దీపాలు, అలుగు పనులు పూర్తి చేశాం. మద్యంబాబులు సోలార్ దీపాలు పగులగొట్టారు. ముళ్ల చెట్టుతో పాదచారుల బాట ధ్వంసమైంది. కట్టపై పిచ్చి మొక్కలు ఇలా తొలిగిస్తే అలా మొలుస్తున్నాయి. పురపాలక సంఘం నిత్యం చూసుకుంటే తప్ప అక్కడ సుందరీకరణ సాధ్యం కాదు. నిధులు వస్తే కట్ట కుంగిన ప్రాంతాల్లో మరమ్మతులు చేస్తాం.

– సాయి సుధాకర్, డీఈఈ, కామారెడ్డి, నీటిపారుదల శాఖ



కట్టపై బీటలు వారుతున్న పాదచారుల బాట

సమాచారం

మే నుంచి ఆన్‌లైన్ యోగా శిబిరం

కామారెడ్డి అర్బన్: ఆదియోగి పరమేశ్వర యోగా అకాడమీ ఆధ్వర్యంలో మే 1 నుంచి 21 రోజుల పాటు ఆన్‌లైన్ వేసవియోగా శిబిరం నిర్వహించనున్నట్టు కోర్సు డైరెక్టర్ నాయిని నివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. 8 నుంచి 54 ఏళ్ల లోపు వారు యోగాలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ వివరాలకు 8333 855 855 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

నేడు రైల్వే మండపంలో ఇంద్రజాల ప్రదర్శన

కామారెడ్డి అర్బన్: శ్రీసీతారామ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక రైల్వే మండపంలో ఇంద్రజాల ప్రదర్శన ఉంటుందని ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాత రమేష్, యెల్లంకి సుదర్శన్‌లు తెలిపారు. మేజీషియన్ జాదూ యుగేందర్ రంగనాథ్, వాసా రాబర్ట్ ప్రదర్శనలుంటాయని పేర్కొన్నారు.

క్రైం కార్నర్

వివాహిత ఆత్మహత్య

బాన్సువాడ రూరల్: మండల కేంద్రంలో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై అశోక్ సోమవారం తెలిపారు. వివరాలు ఇలా.. బాన్సువాడలోని సిద్దిగల్లిలో నివాసముండే సిద్ది గంగామణి (45) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఆర్థిక సమస్యలూ ఎక్కువవడంతో తీవ్ర మనస్తాపం చెందింది. ఈక్రమంలో ఆదివారం రాత్రి ఆమె ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు ఆమెకోసం వెతుకుతుండగా సోమవారం బాన్సువాడ కల్కిచెరువులో మృతదేహం కన్పించింది. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలి భర్త సిద్ది బాలరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

ఖలీల్‌వాడి: నగరంలోని అహ్మద్‌పుర కాలనీ రోడ్డు పక్కన దాడులు చేసుకున్న ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు రెండోటౌన్ ఎస్సై యాసీన్ ఆరాఫత్ సోమవారం తెలిపారు. అజీజ్ అహ్మద్ ఖాన్ ఫిర్యాదు మేరకు అబ్దుల్ సాజిద్, అబ్దుల్ బాసిత్, మొహమ్మద్ ఆసిఫ్ అలీతోపాటు మరి కొందరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే అబ్దుల్ సాజిద్ ఫిర్యాదు మేరకు అజీజ్ అహ్మద్ ఖాన్, జాహెద్ అహ్మద్ ఖాన్, జాకీ అహ్మద్ ఖాన్, సమీర్ అహ్మద్ ఖాన్, మొహమ్మద్ రహీంపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బాలికల అదృశ్యం

నవీపేట: మండలంలోని అభంగపట్నం గ్రామానికి చెందిన ఇద్దరు బాలికలు అదృశ్యమైనట్లు ఎస్సై వినయ్ సోమవారం తెలిపారు. ప్లాస్టిక్ డబ్బాలు ఏరుకునేందుకు ఈనెల 10న ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన బాలికలు తిరిగి ఇంటికి రాలేదన్నారు. బంధువుల ఇళ్లలో వాకబు చేయగా ఎలాంటి ఆచూకీ లభ్యం కాలేదన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్



ఎల్లారెడ్డి: మండలంలోని పోసానిపల్లి గ్రామం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై మహేష్ సోమవారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు అడివిలింగాల శివారులో పోలీసులు కాపలా కాయగా లక్ష్మాపూర్‌కు చెందిన మార్గం రాంజీ, అడివిలింగాలకు చెందిన ఆదిల్‌కు చెందిన రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నామన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీజ్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుంతలకే పరిమితమైన ఇందిరమ్మ మోడల్‌హౌస్



నాగిరెడ్డిపేటలో ఇందిరమ్మ మోడల్‌హౌస్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న అధికారులు (ఫైల్)



తీసిన గుంతలు

- మోడల్‌హౌస్ నిర్మించేందుకు ముందుకురాని కాంట్రాక్టర్లు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో చేపట్టిన ఇందిరమ్మ మోడల్‌హౌస్ నిర్మాణం గుంతలకే పరిమితమైంది. నిర్మాణ పనులు ప్రారంభించినప్పటి నుంచి ఇందిరమ్మ మోడల్‌హౌస్ నిర్మాణం నాలుగునెలల్లో పూర్తి చేయాలని అధికారులు ముందుగా నిర్ణయించారు. నాగిరెడ్డిపేటలో మాత్రం గత ఫిబ్రవరి ఒకటో తేదీన ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణ పనులను అధికారులు ప్రారంభించారు. మూడు నెలలు గడుస్తున్నా నిర్మాణ పనులు ముందుకు సాగక అర్ధాంతరంగా నిలిచిపోయాయి. మండల వ్యవసాయ కార్యాలయం ఎదురుగా ఇందిరమ్మ మోడల్‌హౌస్ నిర్మాణం కోసం తీసిన గుంతలతో కార్యాలయానికి వచ్చేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇందిరమ్మ మోడల్‌హౌస్ నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే రూ.5లక్షలు సరిపోవనే కారణంతో కాంట్రాక్టర్లు పనులు చేపట్టేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని తెలుస్తోంది.

గ్రామాలను అభివృద్ధి వైపు నడిపించాలి

- సేవా కార్యక్రమాలతో మార్పు తీసుకురావాలి
- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



గాలీపూర్‌లో మాట్లాడుతున్న జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్(జుక్కల్): స్వచ్ఛంద సంస్థలు, ట్రస్టులు సేవా కార్యక్రమాలతో గ్రామాలను అభివృద్ధి వైపు నడిపించాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. సోమవారం మహమ్మద్ నగర్ మండలం గాలీపూర్ గ్రామంలో జీవీఆర్ ట్రస్టును ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. సేవా కార్యక్రమాలు ఎంత చేశామని కాకుండా గ్రామాల్లో మార్పు కన్పించాలన్నారు. గాలీపూర్ గ్రామాన్ని దత్తత తీసుకొని ఏడాదిలో అభివృద్ధి చేయాలని ఆయన సూచించారు. అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో జీవీఆర్ ట్రస్టు నిర్వహకుడు శ్రీధర్ రెడ్డి, పిట్లం మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్‌కుమార్‌పటేల్, మహమ్మద్‌నగర్, నిజాంసాగర్ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, ఏలే.మల్లికార్జున్, నాయకులు రమేష్‌యాదవ్, లోక్యానాయక్, సవాయ్‌సింగ్, ఆకాష్, సంతోష్‌రాథోడ్, హన్మండ్లు, తాటిపల్లి సరస్వతి తదితరులున్నారు.

నాయక్‌పోడ్ సర్టిఫికెట్లు ఇప్పించాలని వినతి

తమకు ఎస్టీ కులధ్రువీకరణ పత్రాలు ఇప్పించాలని సోమవారం గాలీపూర్ గ్రామంలో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావును ఆదివాసి నాయక్‌పోడ్ కులస్తులు కోరారు. మూడు నెలల నుంచి మహమ్మద్ నగర్ మండల తహసీల్దార్ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం లేదన్నారు. ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో రాజీవ్ యువవికాస్ రుణాలతో పాటు ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు దూరం అవుతున్నామని వారు ఎమ్మెల్యేను కోరారు. ఈ విషయమై ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు జిల్లా అడిషనల్ కలెక్టర్‌తో ఫోన్లో మాట్లాడి సమస్యను ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు.

కల్యాణ మండపం నిర్మాణానికి భూమి పూజ

భిక్కనూరు: కుల సంఘాలను అభివృద్ధి చేస్తామని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పెద్దమల్లారెడ్డిలో ఎమ్మెల్యే సొంత నిధులతో చేపట్టిన ముదిరాజ్ సంఘం కల్యాణ మండపం నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఎమ్మెల్యే ఎన్నో అభివృద్ధి పనులు చేస్తున్నారన్నారు.కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు రమేష్, గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు లింగం, ప్రతినిధులు యాదగిరి, నరసింహులు, స్వామి, శంకర్, రాజు పాల్గొన్నారు.



ట్రాక్టర్ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

చికిత్స పొందుతూ మృతి

- పోలీసులకు లొంగిపోయిన నిందితుడు



ఒడ్డె గంగాధర్(ఫైల్)

మాక్లూర్: మండలంలోని చిక్లీ గ్రామ శివారులో రోడ్డు పక్కన ఉన్న ఓ వ్యక్తిని ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి అతడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని చిక్లీ గ్రామానికి చెందిన ర్యాపని ఒడ్డె గంగాధర్(48) ఆదివారం సాయంత్రం గ్రామ శివారులో రోడ్డు పక్కన తన బైక్‌ను నిలిపి, కూర్చున్నాడు. అదే గ్రామానికి చెందిన కారం నవీన్ ట్రాక్టర్ నడుపుతూ వేగంగా వచ్చి గంగాధర్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో అతడికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం అతడు మృతిచెందాడు. ఇదిలా ఉండగా ట్రాక్టర్ నడిపిన కారం నవీన్ ట్రాక్టర్‌తో పాటు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు.

ఇద్దరి మధ్య భూ తగాదాలు..

నవీన్‌కు, మృతుడు గంగాధర్‌కు మధ్య కొంతకాలంగా భూ తగాదాలు నడుస్తున్నాయి. ఆదివారం సాయంత్రం గ్రామ శివారులోని కొనుగోలు కేంద్రం వద్ద ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఈక్రమంలో నవీన్ ట్రాక్టర్‌తో కావాలనే అతడిని ఢీకొట్టాడని మృతుడి బంధువులు ఆరోపిస్తున్నారు. దీంతో పోలీసులు ముందస్తు చర్యగా చిక్లీలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటుచేసి, ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి కుమారుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు నవీన్‌పై హత్యకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

మొక్కజొన్న పంట దగ్ధం



కాలిపోయిన మొక్కజొన్నను చూపుతున్న రైతులు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని వడ్లం గ్రామ శివారులో ఓ రైతు సుమారు రెండు ఎకరాల్లో వేసిన మొక్కజొన్న పంట ప్రమాదవశాత్తు దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని వడ్లం గ్రామానికి చెందిన మల్లయ్యల హన్మండ్లు తనకున్న 2.20 ఎకరాలల్లో మొక్కజొన్న పంటను సాగుచేశాడు. సోమవారం పొలం దగ్గరకు వెళ్లి చూడగా చేతికొచ్చిన పంటంతా కాలిపోయింది. పంటను అమ్మి అప్పులు తీర్చుకుందామంటే అగ్ని ప్రమాదంతో కష్టమంతా బూడిదపాలయిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. సుమారు రూ.లక్ష 50వేల నష్టం అయిందని, ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

రేపల్లెవాడలో గుడిసె..



ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని రేపల్లెవాడలో గ్యాస్ సిలెండర్ పేలి గుడిసె దగ్ధమైనట్లు గ్రామస్తులు సోమవారం తెలిపారు. గ్రామంలోని కుమ్మరి తిరుపతికి చెందిన గుడిసెలో అకస్మాత్తుగా గ్యాస్ సిలెండర్ పేలడంతో మంటలు అంటుకున్నాయి. ప్రమాదంలో ఇంట్లోని దుస్తులు, వంటసామగ్రి, అరతులం బంగారం, 20 తులాల వెండి కాలిబూడిదైనట్లు బాధితుడు తెలిపారు. ప్రభుత్వం తమ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతున్నాడు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన పోలీసులు



వర్ని: మండలంలోని అప్పంది ఫారంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించగా పోలీసులు కాపాడారు. వివరాలు ఇలా.. గ్రామంలోని గుగులోతు శివాజీ (30) సోమవారం తన ఇంటి తలుపులు పెట్టుకుని ఉరివేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబసభ్యులు గమనించి, డయల్100కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన బ్లూ కోర్టు సిబ్బంది ఘటన స్థలానికి వెళ్లి ఇంటి తలుపులను బద్దలు కొట్టి శివాజీని కాపాడారు. శివాజీ ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు యత్నించినట్లు ఎస్సై మహేష్ వెల్లడించారు.

అల్ప్రాజోలం పట్టివేత!

నిజామాబాద్ రూరల్: రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖానాపూర్ చౌరస్తా వద్ద సోమవారం విశ్వసనీయ సమాచారం మేరకు పెద్ద ఎత్తున అల్ప్రాజోలంను ట్రెయినీ ఐపీఎస్ సాయికిరణ్ పట్టుకున్నట్లు తెలిసింది. ఈ విషయంపై రూరల్ పోలీసులను 'సాక్షి' వివరణ కోరగా పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

ఆరోటౌన్ పోలీస్‌స్టేషన్ తనిఖీ

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని ఆరో టౌన్ పోలీస్ స్టేషన్‌ను సీపీ సాయి చైతన్య సోమవారం తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందికి పలు అంశాలపై సలహాలు, సూచనలు చేశారు. సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సౌత్ రూరల్ సీఐ సురేష్ కుమార్, ఎస్సై వెంకట్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.